## గాంధీజీ, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిద్దాం



శాకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కొందుర్గు, జూన్ 22: మహాత్మా గాంధీ, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని ధ్యానప్రచార కార్యదర్శులు బంగ్లా ఆంజనేయరెడ్డి, బాలకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పిరమిడ్ మాస్టర్లు జ్యోతి యాదయ్య దంపతుల ఆధ్వర్యంలో కొందుర్గులో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాంసాహారం పాపహారం, జీవహింస మహాపాపం, దేవుళ్లందరి మార్గం అహింసా మార్గం, మాంసం 8 రకాల పాపాలు అని నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ధ్యానం, శాకాహారంపై పలువురు ప్రధాన కూడళ్లలో వివరించారు. కార్యక్రమంలో శంకర్, విష్ణుబాబు జ్యోతి, సుమ, రాజేశ్వరి, తిరుపతయ్య, విఠల్, సంగు స్వాతి, చెన్నయ్య, నవీన్, లావణ్య, ప్రవీణ్, శైలజ, తిరుపతయ్య, నరసింహులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బీసీలకు రిజర్వేషన్లు పెంచాలి



జ్యోతిరావ్‌పూలే విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న పరమేశ్, రాఘవేందర్, బీసీ సంఘం నాయకులు

కడ్తాల్, జూన్ 22: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కంబాల పరమేశ్, బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ డిమాండ్ చేశారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావ్ పూలే విగ్రహానికి బీఆర్ఎస్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్ల పెంపుపై కామారెడ్డి డిక్లరేషన్‌తో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లు పెంచడానికి కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపి చేతులు దులుపుకుందని విమర్శించారు. బీసీలను మరోసారి మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. బీసీల రిజర్వేషన్ల పెంపునకు కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వంతో కొట్లాడి ఒప్పించాలన్నారు. రిజర్వేషన్లను పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి బీసీలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అన్మాస్‌పల్లి గ్రామాధ్యక్షుడు మహేశ్‌యాదవ్, నాయకులు దాసు, వెంకటేశ్, యాదయ్య, అంజి, కుమార్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## పార్కులతో ఆహ్లాదకరమైన వాతావరణం

షాద్‌నగర్‌టౌన్, జూన్ 22: పచ్చని చెట్లతో కూడిన పార్కుల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మున్సిపాలిటీ 7వ వార్డులోని పార్కు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలోని వార్డులకు సంబంధించిన పార్కులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. పచ్చని ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రతి ఒక్కరూ సేద తీరేందుకు పార్కులు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇప్పటికే వార్డులకు సంబంధించిన కాలనీల్లోని పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. మున్సిపాలిటీలోని పార్కుల సుందరంగా తీర్చదిద్దేందుకు కృషి చేస్తున్నామని, పార్కులను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, నాయకులు చెన్నయ్య, తిరుపతిరెడ్డి, బస్వం, ఇబ్రహీం, ప్రవీణ్, అశోక్, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

కడ్తాల్, జూన్ 22: సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఎంతో భరోసాను అందిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామానికి చెందిన సమీన్ బేగం గుండె సమస్యతో బాధపడుతూ నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతుంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ వరంలా మారిందని తెలిపారు. అదే విధంగా వెల్జాల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు ఎమ్మెల్యేని కలిసి వినతపత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్టీసీ బస్సు ఏర్పాటుకు మహేశ్వరం, కల్వకుర్తి డిపోల మేనేజర్లతో ఫోన్లో మాట్లాడినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ అంజయ్యగౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీనివాసమూర్తి, మాజీ సర్పంచ్ రమేశ్‌యాదవ్, మాజీ ఉప సర్పంచ్ ఆజీజ్, నాయకులు విష్ణువర్ధన్‌గౌడ్, ప్రదీప్‌రెడ్డి, మహేశ్, నగేశ్, ఆంజనేయులు, రాజు, శ్రీరాంరెడ్డి, కృష్ణ, ఆరీఫ్, రవికుమార్, జానీ పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ సమ్మేళనం



ఆమనగల్లు, జూన్ 22: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013-2014లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం పట్టణంలోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి గురువులు శశిరెడ్డి, మహాలింగం, కురుమూర్తి, ఉమారాణి, సుశీల, జాస్మిన్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు శివ, నర్సింహ, ప్రదీప్, మౌనిక, శ్రీరామ్, మహేందర్, శ్రీహరి పాల్గొన్నారు.



స్నేహితుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం

యాచారం, జూన్22: మండలంలోని అయ్యవారిగూడ గ్రామానికి చెందిన అశోక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మిత్రుడు చనిపోయిన విషయం తెలుసుకున్న (2001-2002) పదో తరగతి బ్యాచ్‌కు చెందిన బాల్యమిత్రులు ఆదివారం అశోక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ వంతు సహాయంగా రూ.1,00,000 అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



పెద్దఅంబర్‌పేట, జూన్ 22: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు సన్‌రైస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్‌రైస్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాలనీ వాసులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ తదితర పరీక్షలు చేశారు. దాదాపు 150 మంది వైద్య శిబిరంలో పాల్గొని వివిధ పరీక్షలు చేయించుకున్నారని కాలనీ అధ్యక్షుడు గిరి వెంకటయ్యగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు విజయ్‌గుప్తా, కృష్ణచైతన్యనాయక్, మనోహర్ శ్రీపాది, రవి, నాగేందర్, సతీశ్‌గౌడ్, ప్రభాకర్, చంద్రమౌళిచారి, దుర్గాప్రసాద్‌శర్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతాం



ఎస్టీయూటీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్

ఆమనగల్లు, జూన్ 22: ఉపాధ్యాయ సమస్యలపై ఎస్టీయూటీఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. ఇటీవల ప్రభుత్వం ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్టీయూ టీఎస్ కార్యాలయాన్ని ఆదివారం మాజీ ఎమ్మెల్సీ నర్సింహారెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య, పూర్వపు సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిసి సదానందంగౌడ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకుముందు కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సదానందంగౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు హెల్త్ కార్డులు, పీఆర్‌సీని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని లేని యెడల ఉపాధ్యాయ సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీని అరికట్టాలి

### ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్



పాఠశాలలో పుస్తకాలను ఎందుకు విక్రయిస్తున్నారని ప్రశ్నిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్

షాద్‌నగర్‌టౌన్, జూన్ 22: ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా పాఠశాలల్లో పుస్తకాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అలాంటి ప్రైవేట్ పాఠశాలలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పట్టణంలోని ఓ పాఠశాలలో ఆదివారం పుస్తకాలను విక్రయిస్తున్నారనే విషయాన్ని తెలుసుకుని పరిశీలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలో పుస్తకాలను ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలలు అధిక ఫీజులతో విద్యార్థుల తల్లిదండ్రులు సతమతమవుతుంటే పుస్తకాల పేరుతో అధిక వసూలకు పాల్పడడం సరికాదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో యథేచ్ఛగా పుస్తకాలను విక్రయిస్తున్నా అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలను పాటించని పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అదిల్, రఘు, నవీన్, కిరణ్ పాల్గొన్నారు.

## కొనసాగుతున్న నిరాహార దీక్ష



శంకర్‌పల్లి, జూన్ 22 : మా భూములు మాకు తిరిగి ఇచ్చేవరకు ఈ రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని కొండకల్ తండా గిరిజన వాసులు అన్నారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్ తండా శివారులోని గిరిజనుల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్ష 162వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న గిరిజనులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ భూమి తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షలో గోపాల్, భూమ్యా, హస్యా, లక్ష్మి, లీల, దేవమ్మ, మానమ్మ, బుజ్జి, ఇతర గిరిజనులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాలి




సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్ రూరల్, జూన్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ మండల సీపీఐ మహాసభ స్థానిక మహిళా మండలి భవనంలో నిర్వహించారు. మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైయిందన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయడంతోపాటు ముఖ్యంగా ఔటర్‌రింగ్ రోడ్డు చుట్టు పక్కల గ్రామాల రైతులకు వెంటనే రైతుభరోసా ఇవ్వాలన్నారు. లేనిచో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, కల్యాణలక్ష్మిలో లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, అన్నేపు ప్రభుముదిరాజ్, జిలకరాజు, నరేశ్ నాయక్, వెంకటేశ్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా నర్రగిరి, సహాయ కార్యదర్శిగా అన్నేపు ప్రభుతోపాటు 15మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు.

## చెరువులో పడి ఇద్దరు మృతి

### తొలుత బాలిక.. కాపాడే ప్రయత్నంలో యువకుడు మృత్యువాత

### అనాజ్‌పూర్‌లో ఘటన.. బంధువుల రెండు కుటుంబాల్లో విషాదం

పెద్దఅంబర్‌పేట, జూన్ 22: ఓ ప్రమాదం రెండు కుటుంబాల్లో విషాదం నిండింది. ప్రమాదవశాత్తు పదేండ్ల బాలిక చెరువులో పడి మృతిచెందగా.. ఆమెను కాపాడే ప్రయత్నంలో మరో యువకుడు మృత్యువాతపడ్డాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధి అనాజ్‌పూర్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరుకు చెందిన చిన్నపు ప్రతాప్‌రెడ్డి, లీలావతి దంపతులు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని లక్ష్మీప్రియ కాలనీలో నివసిస్తున్నారు. వీరికి కుమార్తె ప్రణీత (10), కుమారుడు కోటిరెడ్డి ఉన్నారు. వీరి బంధువులు గుంటూరుకు చెందిన చింతంరెడ్డి అంజిరెడ్డి, డిగ్రీ చదువుతున్న ఇంద్రసేనారెడ్డి (20) లక్ష్మీప్రియ కాలనీకి వచ్చారు. అనాజ్‌పూర్‌లోని లేఅవుట్ వెంచర్ డెవలప్‌మెంట్ వద్ద ప్రతాప్‌రెడ్డికి సంబంధించిన ప్రొక్లయినర్ నడుస్తున్నట్టు తెలుస్తున్నది. వాహనాన్ని చూసేందుకు అంతా కలిసి వెంచర్ వద్దకు వెళ్లారు. రాత్రి అక్క రాయిపై ఆడుకుంటూ ప్రణీత ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న ఇందిరాసాగర్ చెరువులో పడిపోయింది. గమనించిన ఇంద్రసేనారెడ్డి ఆమెను కాపాడే ప్రయత్నంలో చెరువులో పడి మునిగిపోయాడు. ప్రణీతతోపాటు ఇంద్రసేనారెడ్డి సైతం ప్రాణాలు వదిలారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాల కోసం గాలింపు చేపట్టారు. తొలుత ప్రణీత, ఆ తర్వాత ఇంద్రసేనారెడ్డి మృతదేహాలను వెలికి తీశారు. పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను ఉస్మానియా దవాఖానకు తరలించినట్టు తెలుస్తున్నది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు..

యాచారం, జూన్22: బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకున్నది. సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన శ్రీనాథ్ (18) బైక్‌పై తన స్నేహితులు రామాయణం మణిదీప్ శివ రామకృష్ణ (18), శౌంటి చరణ్ రమేష్ (18)లతో కలిసి 21న వైజాగ్ కాలనీకి వెళ్లాడు. అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో భాగంగా చింతపల్లి మండలం వింజమూరులోని తన అత్తగారి గ్రామానికి వెళ్లి రాత్రి అక్కడే పడుకున్నాడు. 22న శ్రీనాథ్ అతడి ఇద్దరు స్నేహితులతో కలిసి తెల్లవారు జామున వింజమూరు నుంచి జిల్లెలగూడకు తన బైకుపై తిరిగి వస్తున్నారు. మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న బైకు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై ఉన్న ముగ్గురు కిందపడ్డారు. శ్రీనాథ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మిగతా ఇద్దరికీ గాయాలయ్యాయని, వారిని చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. వీరు హైదరాబాద్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## లారీ ఢీకొని ఒకరు..



మహేందర్‌నాథ్ (ఫైల్)

ఆమనగల్లు : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన ఆమనగల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆమనగల్లు పట్టణ సమీపంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపాలిటీ పరిధిలోని ముర్తూజపల్లి గ్రామానికి చెందిన కాలె మహేందర్‌నాథ్ (24) మృతి చెందినట్లు తెలిపారు. కల్వకుర్తి నుంచి పత్తిలోడుతో మధ్యప్రదేశ్ వెళుతున్న లారీ అదే రూట్‌లో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహేందర్‌నాథ్‌ను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ టైర్ల కింద పడి మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలోని పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళ్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కాటన్‌మిల్లు వద్ద జరిగిన ఘటన చూసి మృతదేహం వద్ద వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సహాయం కింద రూ.5వేలు అందజేశారు. అదే విధంగా మాజీ ఎంపీటీసీ నారాయణ రూ.5వేలు అందజేశారు.

## అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలి

కడ్తాల్, జూన్ 22: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో పార్టీలకతీంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో సీడీఎఫ్ నిధులు రూ.4 లక్షలతో చేపట్టిన, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అందరి సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, నాయకులు విష్ణువర్ధన్, వీరయ్య, కృష్ణ, స్కైలాబ్, అర్జున్, మహేందర్, రవి, శ్రీను, వీరేంద్ర, రాజేందర్‌రెడ్డి, అశోక్, రాజు, జలాలుద్దీన్, వెంకటేశ్, శివరాజు, యాదయ్య పాల్గొన్నారు.

## నేడు చింతచెట్ల వేలం

కొందుర్గు, జూన్ 22: కొందుర్గు మండలంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయానికి చెందిన చేపల చెరువు చింత చెట్ల వేలాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యా నిర్వాహణ అధికారి శ్రీనివాస్‌శర్మ ఆదివారం తెలిపారు. ఉదయం 11గంటలకు సర్వే నెం.137లో గంగన్నగూడెం వైపు గల చెరువు చేపలు పెంపకం, అదేవిధంగా దేవస్థానానికి చెందిన చింతచెట్ల ఫలసాయం సేకరించుకునేందుకు వేలం వేస్తామని, ఈ అవకాశాన్ని మండల ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రోడ్డంతా కంపుకంపు

- వరదలా పారుతున్న డ్రైనేజీ నీరు
- 20 రోజులైనా పట్టించుకోని అధికారులు..
- మురుగులో గేదెల తిష్ట.. ఇబ్బందుల్లో ప్రజలు



లూనోట విల్లాస్ వద్ద వరదలా ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు.. సేద తీరుతున్న గేదెలు

బండ్లగూడ, జూన్ 22: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంతో ప్రజలు రాకపోకలకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకుపోతున్నా ఫలితం లేకుండా పోతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఓయాసిస్ అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న డ్రైనేజీ గత 20రోజులుగా పొంగి ఏరులా ప్రవహిస్తున్నది. దీంతో ఆ రోడ్డు గుండా డ్రైనేజీ నీరు వరదలా రావడంతో లూనోట విల్లాస్, ఒయాసిస్ అపార్ట్‌మెంట్, శ్రీలేఖ తదితర కాలనీల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో దుర్గంధాన్ని వెదజల్లుతున్నది. తద్వారా ప్రజలు అనేక అంటు రోగాల బారినపడే అవకాశం ఉందని స్థానిక కాలనీల ప్రజలు వాపోతున్నారు. డ్రైనేజీ నీరు నిల్వ ఉండటంతో గేదెలు సైతం అక్కడే తిష్టవేస్తున్నాయి. డ్రైనేజీ నీరుతో అసలే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే గేదెలతో మరింత తలనొప్పిగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని వెంటనే డ్రైనేజీ సమస్యకు పరిష్కరించాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**కమిషనర్‌కు వినతిపత్రం**

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓయాసిస్ వద్ద పొంగి పొర్లుతున్న డ్రైనేజీ నీటితో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే సమస్య పరిష్కరానికి చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు శనివారం కమిషనర్ శరత్‌చంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఆయన నెల రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు. కాగా, నెల రోజుల వరకు తమ పరిస్థితి ఏంది.. అనేదే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కనీసం అక్కడ నిలబడే పరిస్థితి కూడా లేనపుడు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు ఇలా సమాధానం ఇవ్వడం ఏమిటని ఆశ్చర్యానికి గురయ్యారు.

## ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

శంషాబాద్ రూరల్, జూన్ 22: ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టుతో శాంతిచర్చలు జరపాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెలపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని ఎలైట్ హోటల్‌లో జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ..మధ్య భారతంలో మావోయిస్టుపై దారుణమైన హింసాకాండ కొనసాగించడం, భారీ ఎత్తున బలగాలను మోహరించి వారిని హతమార్చాలని కుట్రను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా మావోయిస్టులు లేకుండా చేయడమే తమ ఎజెండగా చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. దేశాభివృద్ధికి కాకుండా కేవలం అమాయక గిరిజన, అడవి బిడ్డలను చంపేయడం ఏమిటని నిలదీశారు. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు కాన్వెంట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూల్ చేసి విద్యా సంస్థలను వ్యాపార కేంద్రాలుగా మార్చడం దారుణమని మండిపడ్డారు. విద్యను అంగట్లో సరుకులాగా మార్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికఫీజులు వసూల్ చేస్తున్న పాఠశాలలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## కూరగాయలు తెస్తుండగా..

పెద్దఅంబర్‌పేట, జూన్ 22: కూరగాయలకు వెళ్లిన మహిళ రోడ్డు ప్రమాదంలో మృత్యువాతపడింది. జాతీయ రహదారి దాటుతుండగా బైక్ ఢీకొని మృతి చెందింది. ఈ ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన మంజుకుమారి (35) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నది. భర్తతో కలిసి మండల పరిధిలోని ఇనామ్‌గూడ గ్రామం యశోదనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి స్థానికులతో కలిసి కూరగాయలు తెచ్చేందుకు వెళ్లారు. కూరగాయలు పట్టుకుని మరో ముగ్గురితో కలిసి యశోదనగర్ కమాన్ వద్ద హైవేపై రోడ్డు దాటుతుండగా.. చౌటుప్పల్ వైపు నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మంజుకుమారి అక్కడికక్కడే మృతిచెందింది. మంజుకుమారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## యువకుడి అదృశ్యం

చేవెళ్ల టౌన్, జూన్ 22: ఓ యువకుడు అదృశ్యమైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని సాయినగర్ కాలనీకి చెందిన జస్వంత్ శనివారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## నేడు సంగెంలో అమ్మకు వందనం

కేశంపేట, జూన్ 22 : మండల పరిధిలోని సంగెం గ్రామంలో సోమవారం అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల ఇన్‌చార్జి నరేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో ఉదయం 10గంటలకు మొక్కలు నాటి నీరు పోయడం జరుగుతుందని, అలాగే మొక్కలు నాటి పెంచి పెద్ద చేస్తే కలిగే లాభాల గురించి వివరించడం జరుగుతుందన్నారు. యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.